సాక్షి గుంటూరు

మంగళవారం । 26 । ఆగస్టు । 2025



ఎరువుల నిల్వల పరిశీలన

నాదెండ్ల: సాతులూరులోని ఎరువుల రైల్వే రేక్ పాయింట్‌ను డీఏఓ ఎం.జగ్గారావు సోమవారం సందర్శించారు. సరుకు నిల్వల రికార్డులను ఆయన పరిశీలించారు.



దుర్గమ్మకు విరాళాలు

విజయవాడ వెస్ట్ (ఇంద్రకీలాద్రి): కనక దుర్గమ్మకు పలువురు భక్తులు సోమవారం విరాళాలు సమర్పించారు. ఆలయ అభివృద్ధి, నిత్యాన్నదాన పథకాలకు విరాళాలిచ్చారు.



స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

పెనమలూరు: మంత్రి నాదెండ్ల మనోహర్ సోమవారం కృష్ణా జిల్లా పోరంకిలో జేసీ గీతాంజలి శర్మతో కలిసి స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు.

అయినవారి కోసమేనా

టెండర్ల వాయిదాల పర్వం

- రూ.793.21 కోట్లతో పది పనులకు టెండరు నోటీసు
- ఇందులో మూడు సేవలు, ఏడు నిర్మాణ, నిర్వహణ పనులు
- రూ.683.33 కోట్లతో రాజధానిలో నమ్మిళిత పనులు
- రూ.109.88 కోట్లతో విజయవాడ, గుంటూరులో 4 రోడ్ల నిర్మాణాలు
- గుంటూరు ఐఆర్ఆర్ పనికి ఆరు టెండర్లు దాఖలు
- ఫైనాన్షియల్ బిడ్ ఓపెన్‌కు మీనమేషాలు
- విజయవాడలో మూడు పనులకు మూడు వాయిదాలు టెండర్లు
- ఏపీసీఆర్‌డీఏ టెండర్లలో తిరకాసులెన్నెన్నో...



ఆర్టీవో ఆఫీసు వద్ద ఇన్నర్‌రింగ్ రోడ్ సర్కిల్

సాక్షి, ప్రత్యేక ప్రతినిధి: ఏపీ సీఆర్‌డీఏ ఆహ్వానించిన టెండర్లను నిర్ణీత సమయంలో తెరవకుండా మీనమేషాలు లెక్కిస్తూ తమకు అనుకూలురైన కాంట్రాక్టర్ల కోసం ఎదురుచూస్తోందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. టెండర్‌కు బిడ్లు దాఖలైనప్పటికీ సహేతుక కారణాలేవీ లేకుండానే ఫైనాన్షియల్ బిడ్ తెరవకుండా వాయిదా వేస్తుండగా, కొన్ని టెండర్లకు సంబంధించి సాంకేతిక బిడ్‌లను కూడా ఓపెన్ చేయడం లేదని టెండరుదారులు తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు. తమకు అనుకూలురైన బడా కాంట్రాక్టర్లకు పనుకట్టబెట్టడానికే వాయిదాల వ్యవహారాలను ఏపీసీఆర్‌డీఏ ఉన్నతాధికారుల ద్వారా కూటమిలోని పెద్దలు కొనసాగిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. చిన్న, మధ్య తరహా కాంట్రాక్టర్లను పక్కన పెట్టి అన్ని పనులను ఒకటిగా చేసి పెద్దమొత్తంతో టెండరు పిలిచి బడా కంపెనీలకు అప్పజెప్పి భారీస్థాయిలో పర్సంటేజీలు రాబట్టుకోవచ్చనే వ్యూహంలో భాగంగానే వాయిదాల పర్వమని స్పష్టమవుతోంది.

పది పనులకు టెండర్లు

- అమరావతి రాజధాని, విజయవాడ, గుంటూరు నగరాలలో పది పనుల కోసం ఏపీసీఆర్‌డీఏ రూ.793.22 కోట్లతో టెండర్లను ఆహ్వానించింది. పై మొత్తంతో ఏడు నిర్మాణ, నిర్వహణ పనులు చేపట్టాల్సి ఉండగా... తక్కిన మూడు టెండర్లు సేవలకు సంబంధించినవి. నిర్మాణ, నిర్వహణ పనులకుగాను టెండరు డాక్యుమెంట్లను జూలై 11 నుంచి ఆగస్టు 8వ తేదీలోగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపింది. నిర్దేశిత బిడ్లకు ఆగస్టు ఒకటి నుంచి 13వ తేదీలోగా టెండర్లు దాఖలు చేయడానికి గడువు విధించింది.
- గుంటూరు జేకేసీ కాలేజీ మార్గంలోని స్వర్ణ భారతి నగర్ వద్ద నుంచి పెద్దపలకలూరు వరకు ఇన్నర్ రింగ్ రోడ్డు మూడో ఫేజ్ కింద నిర్మాణానికి రూ.34,87,28,545కు టెండరు పిలిచింది. ఆగస్టు ఏడో తేదీ టెండరు దాఖలుకు గడువిచ్చింది. టెక్నికల్ బిడ్డు తెరవగా ఆరు టెండర్లు దాఖలైనట్లు గుర్తించారు. టెండరు నిబంధనల ప్రకారం 8వ తేదీ ఫైనాన్షియల్ బిడ్‌ను తెరవాలి. ఇప్పటివరకు ఆ పనిచేయలేదు. కారణాలేంటని తాము పలుసార్లు సంబంధిత అధికారులను సంప్రదించినా సమాచారం ఇవ్వడం లేదని టెండరుదారులు 'సాక్షి'కి తెలిపారు.
- విజయవాడ నగరంలోని బల్లెంవారివీధి జంక్షన్ నుంచి నిడమానూరు మెయిన్ రోడ్డు జంక్షన్ వరకు (హెచ్‌టీ లైన్ రోడ్) బీటీ హాట్ మిక్స్‌తో రోడ్డు విస్తరణ, సెంట్రల్ డివైడర్ వంటి పనులకు రూ.26,51,89,656 మేరకు టెండరు ఆహ్వానించింది. అదేవిధంగా మహానాడు రోడ్డు నుంచి బల్లెంవారి వీధి నుంచి పోరంకి, నిడమానూరు రోడ్డు విస్తరణ, సెంట్రల్ లైటింగ్, ఇతర పనులకు రూ.25,52,45,567 మరో టెండర్‌ను పిలిచింది. బందరు రోడ్డు నుంచి హెచ్‌టీ లైన్ జంక్షన్ వరకు బల్లెంవారి వీధి రోడ్డు విస్తరణ, సెంట్రల్ డివైడర్, లైటింగ్ పనుల నిమిత్తం 22,96,21,066 టెండరు ఆహ్వానించింది. పై మూడు పనులకు సంబంధించి ఆగస్టు 11వ తేదీ టెక్నికల్ బిడ్ తెరవనున్నట్లు పేర్కొన్నప్పటికీ ఆ మేరకు చేయలేదు. ఏ కారణం లేకుండానే 19వ తేదీ టెక్నికల్ బిడ్ ఓపెన్ చేస్తున్నట్లు చెప్పిన అధికారులు అలా చేయకపోగా మరోసారి ఈ నెల 29వ తేదీకి వాయిదా వేయడం పరిశీలనాంశం. మూడు పనులకు సంబంధించిన టెక్నికల్ బిడ్‌ను ఓపెన్ చేయకుండా మూడు పర్యాయాలు ఎందుకు వాయిదా వేశారనేది అంతుబట్టని అంశంగా ఉందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గుంటూరు ఇన్నర్ రింగ్ రోడ్డు ఫైనాన్షియల్ బిడ్ ఓపెన్ చేయకపోవడం, విజయవాడలోని మూడు పనుల టెండర్లను ఇలా వాయిదాలు వేయడం వెనుక కూటమి ప్రభుత్వ పెద్దల హస్తం ఉన్నట్లు స్పష్టమవుతోందని అంటున్నారు. బడా గుత్తేదారులకు పనులు అప్పగించాలనే వ్యూహంతో ఉన్నప్పుడు ఏపీ సీఆర్‌డీఏ టెండర్లు పిలవడం ఎందుకని నిలదీస్తుండటం చర్చనీయాంశంగా మారింది.



స్వర్ణభారతి నగర్ నుంచి పేరేచర్ల వెళ్లే ఇన్నర్‌రింగ్ రోడ్

పండుగ తరువాతే పరిశీలన

- 28 నుంచి డీఎస్సీ–2025 మెరిట్ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన
- గుంటూరు ఏసీ కళాశాలలో ముమ్మర ఏర్పాట్లు

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయ నియామక ప్రక్రియ వినాయకచవితి పండుగ తరువాతే ప్రారంభం కానుంది. ఇటీవల ప్రకటించిన డీఎస్సీ–2025 ఫలితాల్లో అర్హత సాధించిన అభ్యర్థులతో వివిధ కేటగిరీల వారీగా ఆయా పోస్టులకు ఎంపికైన వారికి పాఠశాల విద్యాశాఖ సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియను ఈనెల 28 నుంచి చేపట్టనుంది. విద్యాశాఖ ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం సోమవారం ప్రారంభం కావాల్సిన సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియను మంగళవారానికి వాయిదా వేసిన అధికారులు వినాయకచవితి పండుగ సెలవు దృష్ట్యా మరోసారి వాయిదా వేశారు. సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియను గురువారం నుంచి చేపట్టేందుకు షెడ్యూల్‌లో మార్పులు చేసినట్లు డీఈఓ సీవీ రేణుక సోమవారం 'సాక్షి'కి తెలిపారు.

ఏసీ కళాశాల వేదిక

ఉమ్మడి గుంటూరు జిల్లాలో భర్తీ చేయనున్నట్లు డీఎస్సీ నోటిఫికేషన్‌లో పొందుపర్చిన 1,143 పోస్టులకు గతంలో 25,067 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఉపాధ్యాయ పోస్టులకు గల అర్హత ప్రాతిపదికన సెకండరీ గ్రేడ్ టీచర్, స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు ఒక దరఖాస్తు దాఖలు చేసిన అభ్యర్థులతో పాటు రెండు పోస్టులకు కలిపి దాఖలు చేసిన దరఖాస్తులతో కలుపుకొని ఆన్‌లైన్‌లో మొత్తం 43,570 దరఖాస్తులు అందాయి. దరఖాస్తు చేసిన అభ్యర్థుల్లో పురుషులు 8,431, మహిళా అభ్యర్థులు 16,636 మంది ఉన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు జూన్ 6వ తేదీ నుంచి జరిగిన ఆన్‌లైన్ కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ పరీక్షల ఫలితాలను ఇటీవల విడుదల చేశారు. వీరిలో ఆయా పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలనను గురువారం నుంచి గుంటూరులోని ఏసీ కళాశాలలో చేపట్టేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. కాగా ఆయా పోస్టులకు ఎంపికై న అభ్యర్థులకు విద్యాశాఖ కార్యాలయం ద్వారా నేరుగా సమాచారాన్ని పంపుతారని, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తగు చర్యలు చేపడతామని డీఈఓ సీవీ రేణుక చెప్పారు.

న్యూస్‌రీల్

మల్లేశ్వరుని సేవలో హైకోర్టు న్యాయమూర్తి దంపతులు



పెదకాకాని: పెదకాకాని శ్రీ మల్లేశ్వరస్వామి దేవస్థానంలో సోమవారం రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బీవీఎల్ఎన్ చక్రవర్తి దంపతులు ప్రత్యేక పూజలు జరిపించారు. వారికి ఆలయ ఉప కమిషనర్ గోగినేని లీలాకుమార్, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసిన న్యాయమూర్తి దంపతులు ముందుగా రాహుకేతు పూజలు చేయించుకున్నారు. అనంతరం భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి వారి అభిషేక సేవ, అమ్మవారికి అష్టోత్తరం ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. గుంటూరు జిల్లా జడ్జి బి.సాయి కల్యాణ చక్రవర్తి దంపతులు సైతం భ్రమరాంబ మల్లేశ్వరస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. పూజా కార్యక్రమాల అనంతరం ఇరువురు న్యాయమూర్తులకు వేద ఆశీర్వచన మండపంలో ఆలయ స్థానాచార్యులు, అర్చకస్వాములు, వేదపండితులు వేద ఆశీర్వచనాలు అందజేశారు. స్వామి వారి శేషవస్త్రాలతో సత్కరించి లడ్డూ ప్రసాదాలు, స్వామి వారి చిత్రపటాన్ని ఆలయ ఉప కమిషనర్ గోగినేని లీలాకుమార్ అందజేశారు.

రూ.3.69 కోట్ల పురుగుమందుల అమ్మకాలు నిలిపివేత



కొరిటిపాడు(గుంటూరు): రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు గుంటూరులోని పురుగు మందుల కంపెనీలు, డిస్ట్రిబ్యూటర్ షాపులు, గోడౌన్స్, డీలర్స్ షాపులను సోమవారం రెండు బృందాలుగా ఏర్పడి విస్తృతంగా తనిఖీలు చేశారు. ఏటుకూరు రోడ్డు, ఆటోనగర్, గోరంట్లలో తనిఖీలు చేశారు. తనిఖీల్లో అనుమతులు లేని, అక్రమంగా నిల్వ చేసిన రూ.3,68,62,987 విలువ గల 91,250 లీటర్ల పురుగు మందులను సీజ్ చేసి అమ్మకాలను నిలిపివేశారు. జిల్లా వ్యవసాయ అధికారి అయితా నాగేశ్వరరావు మాట్లాడుతూ డీలర్లు ఎవరైనా కల్తీ పురుగు మందులు తయారు చేసినా, నిషేధిత పురుగు మందులు అమ్మినా, నిల్వ చేసినా పురుగు మందుల చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తనిఖీల్లో డీడీఏ జి.లక్ష్మణ్, ఏడీఏలు ఎస్.మోహన్‌రావు, సురేషన్, ఆర్.శశిధర్‌రెడ్డి, కె.వెంకటరావు, ఏఓలు సుజాత, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

పశ్చిమ డెల్టాకు 8,216 క్యూసెక్కులు విడుదల



దుగ్గిరాల: విజయవాడ ప్రకాశం బ్యారేజ్ నుంచి 8,216 క్యూసెక్కులు సోమవారం విడుదల చేసినట్లు నీటి పారుదల శాఖ అధికారులు తెలిపారు. బ్యారేజీ వద్ద 12 అడుగులు నీటి మట్టం ఉంది. దుగ్గిరాల సబ్ డివిజన్ హైలెవెల్‌కి 306 క్యూసెక్కులు, బ్యాంక్ కెనాల్ 1,875, క్యూసెక్కులు, తూర్పు కాలువకు 712, పశ్చిమ కాలువకు 292, నిజాపట్నం కాలువకు 528, కొమ్మూరు కాలువకు 2,940 క్యూసెక్కులు, బ్యారేజీ నుంచి సముద్రంలోకి 3,15,200 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

పింఛన్ల రద్దు దారుణం

కూటమి ప్రభుత్వంపై దివ్యాంగుల ఆగ్రహం

- 1995 నుంచి పింఛన్లు తీసుకుంటున్న వారికి సైతం తొలగించడం అన్యాయం
- కలెక్టరేట్‌కు ర్యాలీగా వచ్చి డీఆర్‌ఓకు వినతిపత్రం

గుంటూరు వెస్ట్: అన్ని వర్గాలను మాయమాటలతో మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం కనీసం కనికరం లేకుండా వ్యవహరిస్తోంది. కూటమి ప్రజాప్రతినిధులు ప్రతి పనికీ మాకేంటి అంటూ లెక్కలు చూడడమే తప్ప.. ప్రజల సమస్యలను పట్టించుకున్న పాపాన పోవడం లేదు. సూపర్ సిక్స్ అంటూ ఊదరగొట్టిన ప్రభుత్వం.. వాటిని పూర్తిస్థాయిలో అమలు చేయకపోగా.. ఉన్నవి కూడా తొలగిస్తూ సామాన్యుల నడ్డి విరుస్తుంది. చివరకు దివ్యాంగులను సైతం కూటమి ప్రభుత్వం వదలడం లేదు. పథకాల్లో కోతే లక్ష్యంగా.. అర్హులకు సైతం అన్యాయం చేస్తూ.. ఏళ్లుగా తీసుకుంటున్న వారి పింఛన్లు సైతం తొలగించారు. దీనిపై సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వైఎస్సార్ సీపీ దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షుడు బొక్క అగస్టీన్ ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో బాధిత దివ్యాంగులు హాజరై, జిల్లా అధికారులకు తమ గోడు వినిపించారు..



డీఆర్‌ఓకు వినతిపత్రం అందజేస్తున్న పింఛన్లు రద్దయిన దివ్యాంగులు

వినబడదు.. మాట్లాడలేడు.. పింఛన్ ఆపేశారు



ఈ చిత్రంలోని 11 ఏళ్ల బాలుడి పేరు టి.సాయిరామ్, గుంటూరుకు చెందిన ఈ బాలుడికి వినబడదు.. మాట్లాడలేడు. పుట్టుకతోనే ఈ సమస్య ఉంది. ఇతని రెండు చెవులకు రెండు మిషన్లు ఉంటే గానీ కాస్తంత వినబడదు. తల్లిదండ్రులు ఇద్దరూ కూలీలే. రెక్కాడితే గానీ డొక్కాడని నిరుపేద కుటుంబం. గతంలో ఇతనికి వైద్యులు పరీక్ష చేసి 60 శాతం వైకల్యముందని సర్టిఫికెట్ ఇచ్చారు. ఇప్పుడేమో అది 40 శాతమే ఉందని చెబుతున్నారు. దీంతో పింఛన్‌కు అనర్హుడయ్యాడు.



కలెక్టర్ కార్యాలయంలో ర్యాలీగా వస్తున్న దివ్యాంగులు

గతంలో 69 శాతం.. ఇప్పుడు 40



నేను మరగుజ్జును. గతంలో నాకు 69 అంగవైకల్యముందని సర్టిఫికెట్ ఇస్తే ఇప్పుడేమో 40 శాతముందని అంటున్నారు. వచ్చే పెన్షన్ రూ.6వేలతోనే నా జీవనం కొనసాగుతుంది. అది ఉంటుందో లేదో తెలీడంలేదు. రాదని కొందరంటున్నారు. పెన్షన్ తీసేస్తే నాకు మరో మార్గంలేదు. న్యాయం చేయాలి.

– టి.వెంటేశ్వరరావు, గుంటూరు

న్యాయం చేయాలి..



నాకు రెండు చేతులు లేవు. ఎవరైనా సాయం చేస్తేనే నా జీవనం. గతంలో లేని నిబంధనలు ఇప్పుడు ఎందుకు. ప్రభుత్వం మా పట్ల ఉదాసీనంగా వ్యవహరించి న్యాయం చేయాలని మనవి.

– డి.గణేష్ బాబు, గుంటూరు

మా జీవితాలతో ఆటలాడటం దారుణం



నాకు రెండు కాళ్లు పనిచేయవు. చేయి కూడా అవిటితనం. నేను 1995 నుంచి రూ.200 నుంచి దివ్యాంగ పెన్షన్ పొందుతున్నాను. ఇప్పుడు పెన్షన్ తీసేస్తారని సిబ్బంది అంటున్నారు. దీంతో ఆందోళనగా ఉంది. ప్రభుత్వం మాలాంటి వారి జీవితంతో ఆటలాడడం మానుకోవాలి. కొంచెం ఉదారత చూపి పుణ్యం కట్టుకోండి.

– ఎం.రజని, గుంటూరు

సమయపాలన పాటించండి

- అధికారులతో జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి
- పీజీఆర్ఎస్‌లో 256 అర్జీలు స్వీకరణ



బాధితుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్, అధికారులు

గుంటూరు వెస్ట్: ప్రజా సమస్యల పరిష్కార వేదికకు జిల్లా అధికారులు సమయపాలన పాటించడంలేదని, నిర్ణీత సమయానికే అందరూ తప్పక హాజరు కావాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి సూచించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ కొందరు అధికారులు తమ ఇష్టం వచ్చిన సమయానికి వస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఈ విధానం మార్చుకోవాలన్నారు. అర్జీల పరిష్కారంలో ప్రజల సంతృప్తి స్థాయి తగ్గుతుందని, ఈ విషయాన్ని గుర్తించి మరింత మెరుగైన సేవలు అందించాలన్నారు. ప్రజల నుంచి అందిన 256 అర్జీలను కలెక్టర్‌తోపాటు జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ, డీఆర్ఓ ఖాజావలి, ఆర్డీఓ కె.శ్రీనివాసరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఎం.గంగరాజు, లక్ష్మీకుమారి, జిల్లా అధికారులు పరిశీలించారు.

నెత్తురోడిన జాతీయ రహదారి

- రోడ్డు ప్రమాదంలో ఇద్దరు బాలురు మృతి
- ఆగివున్న లారీని స్కూటీతో ఢీకొన్న మైనర్లు
- స్నేహితుడి పుట్టినరోజు ఫంక్షన్‌కు వెళ్లి వస్తుండగా ఘటన

మంగళగిరి టౌన్: పండుగకు రెండు రోజుల ముందు ఇద్దరు మైనర్లు రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందడం రెండు కుటుంబాల్లో తీవ్ర విషాదం నింపింది. అప్పటివరకు ఆడుతూ పాడుతూ ఆహ్లాదంగా గడిపిన వారు విగత జీవులుగా ఇంటికి రావడం ఆయా కుటుంబాల్లో పెనుశోకం మిగిల్చింది. తాడేపల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఇంటెలిజెన్స్ డిపార్ట్‌మెంట్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న తాడాల వెంకన్నబాబు కొలనుకొండలో ఓ అపార్ట్‌మెంట్‌లో కుటుంబంతో జీవనం సాగిస్తున్నాడు. వెంకన్న బాబు కుమారుడు సాత్విక్ (15), అదే అపార్ట్‌మెంట్‌లో ఉంటున్న తోట ప్రసాద్ కుమారుడి పుట్టినరోజు వేడుకలకు తన స్నేహితుడు వడ్డే శ్రీనరేన్ (15)తో కలసి బైపాస్‌రోడ్‌లో వున్న అనంత ఫంక్షన్ హాల్‌కు వెళ్లారు. జన్మదిన వేడుకల్లో సందడిగా గడిపి ఫంక్షన్ అయిన వెంటనే సాత్విక్, శ్రీనరేన్‌లు స్కూటీపై ఇంటికి బయలుదేరారు. ఆదివారం రాత్రి కొలనుకొండ జయభేరి అపార్ట్‌మెంట్ సమీపంలోకి వచ్చే సరికి గుంటూరు వైపు వెళ్లే మార్గంలో జాతీయ రహదారిపై లారీ ఆగివున్న విషయాన్ని గమనించని బాలురు స్కూటీతో లారీని వెనుక వైపు బలంగా ఢీకొన్నారు. దీంతో నరేన్, సాత్విక్‌లు అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న తాడేపల్లి పోలీసులు మృత దేహాలను పోస్ట్‌మార్టం నిమిత్తం ఎయిమ్స్ ఆసుపత్రికి తరలించారు. సోమవారం పోస్ట్‌మార్టం అనంతరం మృత దేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించారు. సాత్విక్ తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తాడేపల్లి పోలీసులు పేర్కొన్నారు. సాత్విక్, శ్రీ నరేన్‌లు 10వ తరగతి చదువుతున్నారు.



సాత్విక్ (ఫైల్)



శ్రీ నరేన్ (ఫైల్)



ఆగివున్న లారీని ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందిన బాలురు

గడువులోపు అర్జీలకు పరిష్కారం

జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్



సమస్యలు ఆలకిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్

నగరంపాలెం: జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలో సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదులు – పరిష్కార వేదికలో బాధితుల నుంచి జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ అర్జీలు స్వీకరించారు. బాధితుల గోడు ఆలకించారు. చట్టపరమైన పరిధిలో నిర్దీత గడువులోగా సమస్యలు పరిష్కరించాలని జిల్లా ఎస్పీ ఆదేశాలు జారీ చేశారు. బాధితులకు న్యాయం అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా అదనపు ఎస్పీలు రమణమూర్తి (పరిపాలన), హనుమంతు (ఏఆర్), మహిళా పీఎస్ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి ఫిర్యాదిదారుల నుంచి అర్జీలు స్వీకరించారు.

అద్దెలు సక్రమంగా చెల్లిస్తున్నాం..

గత కొన్నాళ్లుగా దుకాణాలు నిర్వహిస్తున్నాం. ఇంటి యాజమాని 2017లో చనిపోయినా, క్రమం తప్పకుండా అద్దెలు చెల్లించాం. అయితే వ్యాపారం బాగా జరుగుతుందని, అదనపు అద్దె చెల్లించమని మాపై యజమాని కుటుంబ సభ్యులు ఒత్తిడి తెచ్చారు. లేదంటే దుకాణాలు కూల్చివేస్తామని బెదిరించారు. దీంతో కోర్టులో దావా దాఖలు చేశాం. ఈ ఏడాది నవంబర్ వరకు ఇంజషన్ ఆర్డర్ ఇచ్చారు. అయినప్పటికీ మమ్మల్ని బెదిరిస్తున్నారు. తమ దుకాణాల తాళాలు ఇప్పించాలని కోరుతున్నాం

– రామచంద్రరావు, షేక్ ఖాజావలి, గిరి, ఎస్‌వీఎస్ కాలనీ

ఇల్లు ఆక్రమించి బెదిరిస్తున్నారు..

నేను వైద్య విద్యను విదేశాల్లో అభ్యసించాలని నిర్ణయించుకున్నా. ఈ విషయమై మా ఇంట్లో అద్దెకు ఉండే వారికి ఎనిమిది నెలలు క్రితమే తెలియజేశాం. రెండు, మూడు నెలల్లో ఖాళీ చేస్తామని బదులిచ్చారు. అయితే నెలలు గడిచినా ఖాళీ చేయకపోగా మాపైనే బెదిరింపులకు పాల్పడుతున్నారు. అసభ్య పదజాలంతో దూషిస్తున్నారు. కొద్ది రోజుల క్రితం జీఎంసీ నోటీసు మేరకు అక్రమంగా ఏర్పాటైన రేకులను తొలగించాం. ఈ క్రమంలో అద్దెకు ఉండే ఓ వ్యక్తి మాపై దాడికి యత్నించాడు. కోర్టులో స్టే లేకపోయినా ఉన్నట్లు హడావుడి సృష్టిస్తున్నారు. మాకు కోర్టు నుంచి ఎటువంటి నోటీసులు రాలేదు. మాపై దాడికి పాల్పడిన వారిపై స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసినా ఎటువంటి చర్యల్లేవు. దీనిపై విచారణ జరిపి, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం.

– ఫిలిప్స్ రూబెన్ భూమిక, కృష్ణవేణి, ఎస్‌వీఎస్ కాలనీ

టీడీపీ నేత సోదరుడు దాడిచేశాడు

ఐదు రోజుల క్రితం ఇంటికి వెళ్లే క్రమంలో దుకాణం వద్ద ఆగాను. ఈ క్రమంలో టీడీపీ నేత సోదరుడు నా వద్దకు వచ్చి మద్యం ఇప్పించాలని బెదిరించాడు. నా వద్ద నగదు లేదని బదులిచ్చాను. నన్నే బూతులు తిడతావా అంటూ నాపై అతనితోపాటు కొందరు కలిసి దాడికి పాల్పడ్డారు. ఈలోగా నా సోదరి, వారి పిల్లలు రాగా, వారిని సైతం అసభ్య పదజాలంతో దూషించాడు. ఈ వివాదంపై స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశాం. కేసు నమోదు చేసినా, ఇప్పటి వరకు మాపై దాడికి పాల్పడిన టీడీపీ నాయకుడి సోదరుడ్ని, అనుచరులను అరెస్ట్ చేయలేదు. అదేమని అడిగితే దాడికి పాల్పడిన వారు గుంటూరులో లేరని, పొరుగు రాష్ట్రంలో ఉన్నారని పోలీసులు చెబుతున్నారు. మాపై దాడికి పాల్పడిన వారంతా ఇళ్ల వద్దనే ఉంటున్నారు. ఇంకా మమ్మల్ని బెదిరిస్తున్నారు. న్యాయం చేయగలరు.

– కె.మరియదాస్, దాసరి విజయ, సీఆర్‌నగర్, దాసరిపాలెం, గుంటూరు రూరల్

నా భార్యను జనసేన కార్యకర్త తీసుకెళ్లాడు

సుమారు తొమ్మిదేళ్ల క్రితం మాకు పెళ్లి అయింది. ఇద్దరు సంతానం. నెల రోజులుగా నా భార్యతో స్థానిక జనసేన కార్యకర్త ఫోన్‌లో మాట్లాడుతున్నాడు. అదేమని అడిగితే నన్ను, ఇద్దరు పిల్లలను చంపుతానని బెదిరించాడు. ఇది మా ప్రభుత్వమని, పోలీసులు తనను ఏం చేయలేరని బెదిరించాడు. గత రెండు రోజుల క్రితం నా భార్యను తీసుకుని వెళ్లిపోయాడు. ఇద్దరు చిన్నారులు తల్లి కోసం రోదిస్తున్నారు. నా భార్యను బెదిరించి, బ్లాక్ మెయిల్ చేసి తీసుకెళ్లిన జనసేన కార్యకర్తపై చట్టప్రకారం చర్యలు చేపట్టాలని కోరుతున్నా. – బాధితుడు, స్వర్ణభారతినగర్

ఆర్‌ఓబీ నిర్మాణంలో ప్రజలను భాగస్వాముల్ని చేయాలి

వైఎస్సార్ సీపీ గుంటూరు,పల్నాడు జిల్లాల పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి మోదుగుల వేణుగోపాలరెడ్డి



డీసీ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేస్తున్న మోదుగుల

నెహ్రూనగర్: నగరంలో నిర్మిస్తున్న శంకర్‌విలాస్ ఆర్‌ఓబీ నిర్మాణంలో అందరినీ భాగస్వామ్యం చేసి ట్రాఫిక్ కష్టాల నుంచి నగర ప్రజలకు విముక్తి కల్పించాలని వైఎస్సార్ సీపీ గుంటూరు, పల్నాడు జిల్లాల పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌చార్జి మోదుగుల వేణుగోపాలరెడ్డి కోరారు. ఈ మేరకు సోమవారం పీజీఆర్‌ఎస్‌లో నగర డెప్యూటీ కమిషనర్ డి.శ్రీనివాస్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఆర్‌ఓబీ నిర్మాణం కారణంగా నగరంలో ట్రాఫిక్ విపరీతంగా పెరిగిపోయిందన్నారు. ముఖ్యంగా స్కూళ్లు, కాలేజీలకు వెళ్లే విద్యార్థులు, వృద్ధులు తీవ్ర అవస్థలు పడుతున్నారని పేర్కొన్నారు. అధికారులు వివిధ ప్రదేశాల నుంచి వచ్చి ఇక్కడ ఉద్యోగాలు చేస్తున్నారని, వారికి నగర ట్రాఫిక్‌పై పూర్తి అవగాహన ఉండదని, స్థానికులను ఆర్‌ఓబీ నిర్మాణంలో భాగస్వామ్యం చేయాలని కోరారు. ఇందుకుగాను అన్ని రాజకీయపార్టీ నాయకులు, ఆర్‌అండ్‌బీ, ఎలక్ట్రికల్, జీఎంసీ, రైల్వే అధికారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి ట్రాఫిక్ నియంత్రణకు సలహాలు సూచనలు స్వీకరించి దానికి అనుగుణంగా ట్రాఫిక్ రద్దీ సమస్యకు పరిష్కారం చూపాలని కోరారు.

భూగర్భ జలవనరులు పెంపొందించాలి

జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

గుంటూరు వెస్ట్: జిల్లాలో భూగర్భ జలవనరులను పెంపొందించేందుకు గ్రామీణ నీటిపారుదల, పబ్లిక్ హెల్త్, జలవనరుల శాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో జేసీ ఎస్.భార్గవ్‌తేజతో కలిసి వీడియో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ భూగర్భ జలవనరులు పరిరక్షించేందుకు చెరువులు నింపుకోవడం, రెయిన్ హార్వెస్ట్ క్లస్టర్స్ ఏర్పాటు చేసుకోవడం, మొక్కలు పెంచడం, తదితర కార్యక్రమాలు గ్రామీణ స్థాయి నుంచి అమలుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో రికార్డులను ఈపీటీఎస్ పోర్టల్‌లో అప్‌లోడు చేసే ప్రక్రియను అన్ని శాఖల అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు.

బాల్య వివాహాల అనర్థాలపై అవగాహన



సదస్సులో మాట్లాడుతున్న న్యాయమూర్తి సయ్యద్ జియావుద్దీన్, వేదికపై అధికారులు

గుంటూరు లీగల్: జాతీయ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు సోమవారం బుడంపాడు ఎస్టీ కాలనీలో బాల్యవివాహాలు, గిరిజన మహిళల్లో ఎర్లీ ప్రెగ్నెన్సీ పై వారం రోజుల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. న్యాయ విజ్ఞాన సదస్సులో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సయ్యద్ జియాఉద్దీన్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండని ఆడ పిల్లలకు, 21 సంవత్సరాలు నిండని పురుషులకు వివాహాలు చేయరాదన్నారు. అలా చేయడం చట్టపరంగా నేరమన్నారు. ఆ వయసులో వారు శారీరకంగా, మానసికంగా వివాహాలకు సిద్ధంగా ఉండరని, చదువుకోవడం ముఖ్యమన్నారు. గిరిజన మహిళలు ఎర్లీ ప్రెగ్నెన్సీ వలన అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని, వారికి అవగాహన కల్పించాలన్నారు. మెడికల్ అండ్ హెల్త్ డిపార్ట్‌మెంట్ అధికారి డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు, గిరిజన సంక్షేమశాఖ అధికారి రఘునాథ్, మహిళ, శిశు సంక్షేమ శాఖ అధికారి విజయకుమార్, అధికారులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణుడి రూపంలో ఉన్న విగ్రహం తొలగింపు

- తక్కెళ్లపాడులో శ్రీకృష్ణుడి రూపంలో ఉన్న ఎన్టీఆర్ స్థానంలో మరో విగ్రహం ఏర్పాటు చేసుకున్న నిర్వాహకులు
- ముగిసిన విగ్రహ వివాదం



ఈనెల 24వ తేదీ ఆవిష్కరించిన శ్రీకృష్ణుని రూపంలో ఉన్న ఎన్టీఆర్ విగ్రహం



ఈనెల 25న ఏర్పాటు చేసిన విగ్రహం

పెదకాకాని: శ్రీకృష్ణుని రూపంలో ఉన్న ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ వివాదానికి దారి తీయడంతో నిర్వాహకులు స్వచ్ఛందంగా రాత్రికి రాత్రే ఆ విగ్రహాన్ని తొలగించి వేరే విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. గుంటూరు జిల్లా పెదకాకాని మండలంలోని తక్కెళ్ళపాడులో ఈనెల 24వ తేదీన శ్రీకృష్ణుడి రూపంలో ఉన్న ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ చేస్తున్నట్లు టీడీపీ నాయకులు ప్రకటించారు. సమాచారం అందుకున్న యాదవ సంఘం నేతలు, బీసీవై పార్టీ నేతలు 23వ తేదీన తక్కెళ్ళపాడులో విగ్రహావిష్కరణ వద్దకు చేరుకుని, ఎన్టీఆర్‌ను శ్రీకృష్ణుని రూపంలో ఆవిష్కరించడం అంటే శ్రీకృష్ణుడికి ప్రతి ఇంటా పూజలు చేసే యాదవ కులాన్ని, హిందువులను అవమానించడమేనని ఈ విగ్రహావిష్కరణ నిలిపివేయాలని స్థానికులను కోరారు. అయినప్పటికీ ఆదివారం మండల టీడీపీ, గ్రామ పెద్దలు శ్రీకృష్ణుని రూపంలో ఉన్న ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఆ విగ్రహం నుంచి పిల్లనగ్రోవి, నెమలి పింఛం తొలగించారు. మరోసారి అదే విగ్రహం చేతిలో కత్తి పెట్టారు. అదే రోజు సాయంత్రం నిరసన తెలియజేసేందుకు అక్కడికి చేరుకున్న యాదవ సంఘం నాయకులు, బీసీవై పార్టీ ప్రతినిధులకు టీడీపీ నాయకులకు మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. అప్పటికే బీసీవై పార్టీ అధినేత సోమవారం ఛలో తక్కెళ్ళపాడు కార్యక్రమానికి పిలుపునిచ్చారు. ఈ పిలుపులో భాగంగా యాదవసంఘ ప్రముఖులు గుంటూరు నగరంలో సమావేశమయ్యారు. అలాగే తక్కెళ్ళపాడు గ్రామంలో టీడీపీ నాయకులు, విగ్రహావిష్కరణ కమిటీ సమావేశం నిర్వహించారు. వివాదాస్పద విగ్రహావిష్కరణ కులాలు, మతాల మధ్య సమస్యగా మారుతుందని ఇంటెలిజెన్స్ వర్గాల సమాచారం మేరకు.. ఆదివారం రాత్రి నిర్వాహకులు శ్రీకృష్ణుని రూపంలో ఉన్న విగ్రహాన్ని స్వచ్ఛందంగా తొలగించారు. అదే స్థానంలో ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటు చేయడంతో వివాదాలకు తెరపడటంతో పాటు శాంతియుత వాతావరణం నెలకొంది. ఎటువంటి వివాదాలు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

29న అమరావతిలో జాబ్‌మేళా

తాడికొండ: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నైపుణ్యాభివృద్ధి–శిక్షణ శాఖ ఆధ్వర్యంలో ఏపీసీఆర్డీఏ సౌజన్యంతో ఈనెల 29వ తేదీ ఉదయం 10 గంటల నుంచి తుళ్లూరులోని ఎస్‌పీసీ – సీఆర్డీఏ స్కిల్ హబ్ కేంద్రంలో 'జాబ్ మేళా' నిర్వహించనున్నట్లు సీఆర్డీఏ కమిషనర్ కార్యాలయ వర్గాలు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేళాలో ఎంపికైన అభ్యర్థులకు అమరావతి పరిసర ప్రాంతాలలో ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరుగుతోందని, జాబ్ మేళాలో సెమీ కండక్టర్ – ఐటీ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్, బీఎస్‌ఆర్ ఇన్‌ఫ్రాటెక్ ఇండియా లిమిటెడ్, ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ కో. లిమిటెడ్, భవ్య హెల్త్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్, సంతోష్ ఆటోమోటార్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలు పాల్గొంటున్నాయన్నారు. ఇంజినీర్లు, డెవలప్మెంట్ మేనేజర్లు, ఫైనాన్షియల్ అడ్వైజర్లు(పార్ట్ టైం), రీజనల్ మేనేజర్లు, జిల్లా మేనేజర్లు, ఆపరేషన్స్ ఎగ్జిక్యూటివ్స్, ఎమర్జెన్సీ మెడికల్ టెక్నిషియన్లు, డ్రైవర్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్, టీం లీడర్ ఉద్యోగాలను భర్తీ చేసేందుకు ఈ జాబ్ మేళా నిర్వహించడం జరుగుతోందన్నారు. ఎస్ఎస్‌సి, ఇంటర్, బీటెక్, ఎంఎల్‌టీ, బీఎస్సీ నర్సింగ్, ఏదైనా డిగ్రీ, పీజీ చదివిన ఫ్రెషర్స్, అనుభవం ఉన్న అభ్యర్థులు ఈ జాబ్ మేళాకు హాజరుకావచ్చు. జాబ్ మేళాలో ఎంపికైన అభ్యర్థులకు రూ.17,000 నుంచి రూ.40,000 వరకు వేతనం లభిస్తుంది. కొన్ని ఉద్యోగాలకు అదనంగా ఇన్సెంటివ్‌లు, అలవెన్సులు సైతం లభిస్తాయి. ఈ జాబ్ మేళా ద్వారా రాజధాని ప్రాంత యువతకు మంచి ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. అర్హత కలిగిన అభ్యర్థులు తప్పకుండా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని వారు తెలిపారు. జాబ్ మేళాకు సంబంధించిన పూర్తి వివరాలకు గ్రామంలోని సీఆర్డీఏ ఫెసిలిటేటర్‌ను సంప్రదించాలన్నారు. శంకర్ 9848424207, శ్రీకర్ 9963425999 నెంబర్లలో కాల్ చేసి తెలుసుకోవాలన్నారు. జాబ్ మేళాలో పాల్గొనేవారు రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు నైపుణ్యం పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు.

28న నిధి ఆప్‌కే నికత్

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరులోని ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ (ఈపీఎఫ్) ప్రాంతీయ కార్యాలయ ఆధ్వర్యంలో ఈనెల 28న నిధి ఆప్‌కే నికత్ కార్యక్రమాన్ని ఆరు జిల్లాల్లో నిర్వహిస్తున్నట్లు సహాయ పీఎఫ్ కమిషనర్ పి.గోపాల్‌సింగ్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. గుంటూరు, కృష్ణా, ఎన్టీఆర్, పల్నాడు, బాపట్ల, ప్రకాశం జిల్లాల్లో ఉదయం 9.30 గంటల నుంచి జరగనున్న సమావేశాల్లో యజమానులు, ఉద్యోగులు, పెన్షనర్లతో పాటు ఇతర వాటాదారులు, లబ్ధిదారులతో పరస్పరం ముఖా ముఖిగా చర్చలు జరుగుతాయని తెలిపారు. పీఎఫ్ భాగస్వామ్య యజమానులందరూ కార్యక్రమానికి విధిగా హాజరై, ఫిర్యాదులు ఉంటే వాటిని పరిష్కరించేందుకు వీలుగా ఉద్యోగులతో పాటు అధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు. అదే విధంగా నిధి ఆప్‌కే నికత్ కార్యక్రమానికి హాజరుకాగోరు వాటాదారులు, ఇతర శాఖల అధికారులు సూచనలు చేయవచ్చని తెలిపారు. గుంటూరు అరండల్‌పేటలోని సెయింట్ ఇగ్నేషియస్ ఇంగ్లిష్ మీడియం పాఠశాల, కృష్ణాజిల్లా నందివాడలోని ఉమా స్పింటెక్స్ ప్రైవేటు లిమిటెడ్, ప్రకాశం జిల్లా సింగరాయకొండలోని పెర్ల్ డిస్టలరీస్, బాపట్లలోని లిటిల్ ఏంజెల్స్ స్కూల్, సత్తెనపల్లిలోని శ్రీరాఘవేంద్ర బాలకుటీర్, విజయవాడ కానూరులోని బోస్ బిల్డింగ్స్‌లో ఉన్న నవతా రోడ్ ట్రాన్స్‌పోర్ట్‌లో నిర్వహించనున్న నిధి ఆప్‌కే నికత్‌లో పాల్గొని ఫిర్యాదులు, సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.